సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 20, సెప్టెంబర్, 2023



పాడేరు-భద్రాచలం ఆర్టీసీ సర్వీసు

పాడేరు నుంచి భద్రాచలానికి బస్సు నడిం పేందుకు సర్వే చేస్తున్నామని పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ వెల్లడించారు. 8లో



ఇంజినీరింగ్ పనులు వేగవంతం

గడపగడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో



సైక్లింగ్‌తో ఆరోగ్యం

సైక్లింగ్‌తో ఆరోగ్యం సాధ్యమని విశాఖలోని వడ్లపూడి గ్రీన్‌సిటీకి చెందిన సైక్లిస్ట్‌లు శివకుమార్‌రెడ్డి, రవికృష్ణ అన్నారు. 8లో

న్యూస్‌రీల్

నేడు ముంచంగిపుట్టులో జగనన్నకు చెబుదాం

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: ముంచంగిపుట్టు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం స్పందన నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వశాఖలకు చెందిన జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ముంచంగిపుట్టు మండలంలోని ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

22,23 తేదీల్లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి పర్యటన

సాక్షి,పాడేరు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్ ఈనెల 22, 23 తేదీల్లో జిల్లాలో పర్యటిస్తున్నారని ఎన్‌సీఎస్టీ రిసెర్చ్ అధికారి పీకే పరిడ మంగళవారం జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటన అనంతరం ఈనెల 22వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆయన పాడేరు చేరుకొని 5.30 గంటలకు గిరిజన సంఘాలతో సమావేశం నిర్వహిస్తారు. రాత్రి పాడేరులోనే బస చేసి 23వతేదీ ఉదయం 9.30 గంటలకు హుకుంపేట మండలంలోని మఠం గ్రామంలోని వనవాసీ కల్యాణ ఆశ్రమం, మత్స్యలింగేశ్వరస్వామి విద్యా నిలయాన్ని సందర్శిస్తారని ఆయన వెల్లడించారు. అక్కడ నుంచి నేరుగా ఉప్ప గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చేరుకుని ఇక్కడ గిరిజన విద్యార్థినులతో సమావేశం అవుతారని తెలిపారు. అనంతరం 11 గంటలకు పాడేరు చేరుకుని ఏకలవ్య, కేజీబీవీ విద్యాలయాలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం భోజన విరామ అనంతరం 2.30 గంటలకు అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. అనంతరం సాయంత్రం ఐదు గంటలకు ఇక్కడి నుంచి విశాఖపట్నం వెళ్తారని ఆయన తెలిపారు.

రేషన్ ఇవ్వకపోవడంపై చర్యలు



రేషన్ కార్డుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న మల్లేశ్వరరావు

గూడెంకొత్తవీధి: వంచుల పంచాయతీ మురుగడ పల్లికి మూడు నెలలుగా రేషన్ అందడం లేదని అందిన ఫిర్యాదుపై జీసీసీ మేనేజర్ మల్లేశ్వరరావు మంగళవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. ఏడీఎం వాహనదారుడు బియ్యం పంపిణీ చేయకపోవడంతో వారికి బియ్యం అందలేదని విచారణలో తేలింది. బియ్యం అందని విషయంపై నేరుగా గ్రామస్తులు కొద్ది రోజుల క్రితం జీసీసీ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన విచారణ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలిపారు. బియ్యం సరఫరాకు వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు: గిరిజన యువతీ యువకులు వారి నచ్చిన వృత్తిలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు పొడిగించినట్టు ఆయన పేర్కొన్నారు.స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

108లో సుఖ ప్రసవం



శిశువును అందజేస్తున్న సిబ్బంది

హుకుంపేట: మండలంలోని తంతారి పంచాయతీ కూతంగి గ్రామానికి చెందిన గర్భిణి ఎస్.రాములమ్మ 108లో మగశిశువుకు జన్మనిచ్చింది. ఆమెకు సోమవారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. దీంతో ఆమెను వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో పురిటినొప్పులు ఎక్కువవడంతో మగశిశువుకు జన్మనిచ్చింది. ప్రథమ చికిత్స అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ శ్రీను తెలిపారు.

ఏవోబీలో రెడ్ అలర్ట్

- రేపటి నుంచి మావోయిస్టు పార్టీ 19వ వార్షిక వారోత్సవాలు
- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- సరిహద్దు ప్రాంతంలో బలగాలు భారీగా మోహరింపు



ఏవోబీలో కూంబింగ్‌కు వెళ్తున్న పోలీసు బలగాలు

సాక్షి,పాడేరు : మావోయిస్టు పార్టీ 19వ వార్షిక వారోత్సవాలకు సన్నద్ధమవుతున్న వేళ.. పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఇప్పటికే ఆ పార్టీ చర్ల, శబరి ఏరియా కమిటీ పేరుతో ఎటపాక ప్రాంతంలో పోస్టర్లు, కరపత్రాలు వెలిశాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా, ఒడిశా పోలీసు యంత్రాంగాన్ని కేంద్ర హోంశాఖ అప్రమత్తం చేసింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని దండకారణ్య ప్రాంతం, అల్లూరి సీతారామరాజు జిల్లాకు సరిహద్దులో ఉన్నందున పోలీసు శాఖ రెడ్ అలర్ట్‌ను అమలుజేస్తోంది.

ముమ్మరంగా కూంబింగ్

చింతూరు, రంపచోడవరం, పాడేరు, చింతపల్లి పోలీసు సబ్‌డివిజన్ల అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా అప్రమత్తం చేశారు. ఏవోబీ వ్యాప్తంగా కూంబింగ్‌కు ఆదేశాలిచ్చారు. జిల్లాతో పాటు సరిహద్దులో ఉన్న ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్, ఛత్తీస్‌గఢ్‌లోని పోలీసు యంత్రాంగమంతా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. మారుమూల ప్రాంతాల్లో కూంబింగ్‌కు విస్తృతం చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లతో పాటు అవుట్‌పోస్టులు, ఒడిశాలోని కటాఫ్ ఏరియాలోని అవుట్‌పోస్టుల్లో రెడ్ అలర్ట్‌ను అమలు చేస్తున్నారు. పోలీసు బలగాలు డేగకన్నుతో అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఏవోబీ వ్యాప్తంగా అవుట్‌పోస్టుల్లోను అదనపు బలగాలు మోహరించాయి.

నైట్ హాల్ట్ సర్వీసుల నిలిపివేత: మావోయిస్టు పార్టీ వార్షిక వారోత్సవాలు ముగిసేంతవరకు జిల్లాలోని నైట్‌హాల్ట్ ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. రంపచోడవరం, సీలేరు ప్రాంతాల నుంచి చింతూరు మీదుగా భద్రాచలం వెళ్లే రాత్రి బస్సు సర్వీసులను ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా కూనవరం మీదుగా న డుపుతున్నారు. మారుమూల గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనాలను పోలీసు బలగాలు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి.

అప్రమత్తం చేసిన పోలీసులు

మావోయిస్టు పార్టీ అవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు ,పలు రాజకీయ పార్టీల నేతలంతా సురక్షిత ప్రాంతాల్లోనే ఉండేలా అప్రమత్తం చేస్తూ పోలీసుశాఖ నోటీసులు జారీ చేసింది. అలాగే అధికారులు, ప్రజాప్రతినిధులు మారుమూల ప్రాంతాల పర్యటనలను రద్దు చేసుకోవాలని ఇప్పటికే సూచించింది.

పోలీసుశాఖ అప్రమత్తం

మావోయిస్టు పార్టీ అవిర్భావ వార్షిక వారోత్సవాలతో జిల్లాలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశాం. జిల్లాకు సరిహద్దులో ఉన్న అన్ని రాష్ట్రాల పోలీసు యంత్రాంగంతోను సమన్వయం చేసుకుంటూ జిల్లా పోలీసు బలగాలను కూంబింగ్ చర్యల్లో నిమగ్నం చేసాం.ప్రజాప్రతినిధులు,రాజకీయ పార్టీల నేతలు,అధికారులంతా మారుమూల ప్రాంతాలకు వెళ్లకుండా తగిన ఆదేశాలిచ్చాం, జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్‌ను ప్రకటించి భద్రతా చర్యలను విస్తృతం చేశారు.

వారోత్సవాలను అడ్డుకుంటాం



సీఆర్‌పీఎఫ్ జవాన్లు, ఇతర స్పెషల్ పార్టీ పోలీసులంతా కూంబింగ్ చేపడుతున్నారు. ఎస్‌బీ, ఇంటిలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. మావోయిస్టు పార్టీ అవిర్భావ వారోత్సవాలను అడ్డుకుంటాం. జిల్లాకు సరిహద్దులోని అన్ని రాష్ట్రాల పోలీసు యంత్రాంగాలను సమన్వయం చేసుకుంటూ కూంబింగ్ ముమ్మరం చేశాం.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, పాడేరు

తప్పుచేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు

- అక్రమాల్లో చంద్రబాబు ఘనాపాటి
- రాజధాని నిర్మాణం పేరిట భూ కుంభకోణం
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: తప్పుచేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడంలో చంద్రబాబుకు సాటి ఎవరూ లేరన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు చేసిన రూ.371 కోట్ల కుంభకోణం నిజం కాదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు చంద్రబాబు అక్రమాల చిట్టాను బయట పెట్టిందన్నారు. చేసేదేమీ లేక రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 2014–19 మధ్యకాలంలో సీఎంగా ఉండి స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో రూ.వందల కోట్ల మేర ఆర్థిక అవకతవకలుకు పాల్పడ్డారన్నారు. డొల్ల కంపెనీలను సృష్టించి ముడుపులు పొందారని వివరించారు. రాజధాని నిర్మాణం పేరుతో కూడా రూ.లక్షల కోట్ల మేర కుంభకోణాలకు పాల్పడారన్నారు. తీగలాగితే డొంక కదిలినట్లు చంద్రబాబునాయుడు అక్రమాల చిట్ట ఒకొక్కటి బయట పడుతోందన్నారు. ఆయన హయాంలో అన్ని వ్యవస్థలను పూర్తి నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీని ప్రజలే భూస్థాపితం చేస్తారన్నారు. చంద్రబాబునాయుడు చేసిన అని కుంభకోణాల్లో ఆయన తనయుడు నారా లోకేష్ కూడా పాత్రధారుడేనన్నారు. రాష్ట్రంలో పాదయాత్ర పేరుతో విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు, భవిష్యత్తులో టీడీపీ వల్ల మరింత దాడులు హత్యలు జరిగే ప్రమాదం ఉందన్నారు. చంద్రబాబును జైలుకు పంపించినా సొంతపార్టీలో కూడా సానుభూతి లేదన్నారు. ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ హస్తినకుమార్, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, కోఆప్షన్ సభ్యుడు రహీంతుల్లా, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రాణదాత సీఐ సుధాకర్

ఇప్పటివరకు 27 సార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న పాడేరు సీఐ సుధాకర్

సాక్షి,పాడేరు: పాడేరు సీఐ సుధాకర్ ప్రాణదాతగా మానవత్వాన్ని చాటుకుంటున్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సేవా పక్వాడ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. పాడేరు జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని ప్రతిరోజు నిర్వహిస్తుండడంతో రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. పాడేరు సీఐ సుధాకర్ మంగళవారం రక్తదానం చేశారు. ఇప్పటివరకు ఆయన 27 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పాడేరు సీఐగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఏడు సార్లు పాడేరులో రక్తదానం చేయడమే కాకుండా పోలీసుశాఖలోని అధికారులు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు, పోలీసు సిబ్బందిని చైతన్యవంతులను చేశారు. చదువుతున్న రోజుల్లో కూడా రక్తదానం చేసేందుకు ముందుండేవారు. ఆయనను పలువురు అభినందిస్తున్నారు.

గిరిజనుడిపై ఎస్‌ఐ దాడి సరికాదు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పెదబయలులో ఎస్టీ కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేస్తున్న కించేయి విజయ్‌కుమార్, గిరిజన నేతలు



కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్న విజయ్‌కుమార్, గిరిజన సంఘ ప్రతినిధులు



పెదబయలు పోలీసుస్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న విశ్వేశ్వరరాజు

పెదబయలు: గిరిజనుడిపై దాడికి పాల్పడటం సరికాదని, గిరిజనుల పరిరక్షణకు కృషి చేయాల్సిన ఎస్ఐ దారుణంగా కొట్టారని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. తనపై ఎస్ఐ మనోజ్‌కుమార్ అన్యాయంగా దాడి చేసి కొట్టారని లక్ష్మీపేట పంచాయతీ మొండికోట గ్రామానికి చెందిన కించేయి విజయ్‌కుమార్, కుటుంబసభ్యులు మంగళవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన దాడి విషయాన్ని ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన స్థానిక పోలీసుస్టేషన్‌ను సందర్శించి పోలీసు సిబ్బంది నుంచి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి కారణాలు లేకుండా గిరిజనుడిపై ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ నెల 14 తేదీన కించేయి విజయ్‌కుమార్ తండ్రి లేటు గణపతి చెందిన పట్టా భూమి సరిహద్దులో జియో టవర్ ఏర్పాటుకు కాంట్రాక్టర్ స్థలం అడిగారు. దీంతో తక్కువ భూమి ఉన్నందున సెల్ టవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వలేమని గ్రామానికి వచ్చిన రెవెన్యూ అధికారులకు విజయకుమార్ చెప్పాడన్నారు. దీంతో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది గ్రామానికి వెళ్లి విజయ్ కుమార్‌ను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. సెల్ టవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వాల్సిందేనని లేకుంటే అరెస్టు చేస్తామని హెచ్చరించారన్నారు. మీ ఇంట్లో గంజాయి ఉంది నిన్ను వెంటనే అరెస్టు చేస్తామని ఇంటి దగ్గర నుంచి వారి సొంత భూమి వరకు ఈడ్చుకుంటూ తీసుకువెళ్లి కొట్టారని ఆయన వివరించారు. ఎందుకు కొడుతున్నారని ఈ సమయంలో అతని తల్లి అడ్డుకున్నా ఎస్ఐ లక్ష్య పెట్టలేదన్నారు. దారుణంగా కొట్టడం వల్ల పాడేరు జిల్లా ఆస్పత్రికి విజయ్‌కుమార్‌ను తీసుకువెళ్లారన్నారు. ఈ విషయాన్ని ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకురావడంతో ఎస్ఐ దాడికి పాల్పడినట్టు తమ పరిశీలనలో తేలిందన్నారు. గిరిజనుల పట్ల చిన్నచూపు తగదన్నారు. అధికారం ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎస్టీ కమిషన్ చూస్తూ ఊరుకోదన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట గిరిజన సంఘం నాయకులు బొండా సన్నిబాబు, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదు

పెదబయలు: జియోటవర్ నిర్మాణానికి స్థలం ఇవ్వలేదని దాడికి పాల్పడిన స్థానిక ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పాడేరులోని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు కించేయి విజయ్‌కుమార్,గిరిజన సంఘ నాయకులు తెలిపారు. కలెక్టర్ క్యాంపులో ఉన్నందున కార్యాలయ సిబ్బందికి ఫిర్యాదు అందజేశామనివారు పేర్కొన్నారు. ఎస్ఐపై ఎస్పీ, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు. గిరిజన సంఘం ప్రతినిధులు బొండా సన్నిబాబు, చెండా లోహితాసుడు పాల్గొన్నారు.

తప్పిపోయిన విద్యార్థి తల్లికి అప్పగింత



విద్యార్థి వెంకట గణేష్‌ను హెచ్‌ఎం సమక్షంలో తల్లికి అప్పగించిన ఎస్ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుంచి వెళ్లిపోయిన తొమ్మిదో తరగతి విద్యార్థి జనుమూరి వెంకటగణేష్ (14)ను హెచ్‌ఎం అప్పలనాయుడు సమక్షంలో అతని తల్లి సూర్యకుమారికి ఎస్ఐ సంతోష్‌కుమార్ సోమవారం అప్పగించారు. అడ్డతీగల మండలం, దాకోడు పంచాయతీ జాజిపాలెం గ్రామానికి చెందిన విద్యార్థి వెంకటగణేష్ మండలంలోని పనసలపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తగగతి చదువు తున్నాడు. ఈనెల 11వ తేదీ ఉదయం గం.9.30 లకు పాఠశాల నుంచి బయటకు వెళ్లి.. తిరిగి రాలేదు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో హెచ్‌ఎం అప్పలనాయుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలోని కోళ్లఫారంలో ఉన్నట్టు పోలీసులు కనుగొన్నారు. వెంటనే అక్కడి నుంచి తీసుకువచ్చి హెచ్‌ఎం సమక్షంలో అతని తల్లికి అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీలకు స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

అరకులోయ రూరల్: ఏపీ ఇంటర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక స్పోర్ట్ పాఠశాల నుంచి 14 మంది విద్యార్థులు వివిధ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో పోటీల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

22న పాడేరులో జాబ్‌మేళా



జాబ్‌మేళా ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న పాడేరులో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. జాబ్‌మేళాకు సంబంధించిన ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆమె మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం నిర్వహించే జాబ్‌మేళాకు పలు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు హాజరవుతారన్నారు.టెన్త్, ఇంటర్‌తో పాటు ఉన్నత విద్యార్హత ఉన్న నిరుద్యోగ అభ్యర్థులంతా తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధి పిట్టా నవీన్ పాల్గొన్నారు.

కొలువుదీరిన గణనాథులు

- భక్తిశ్రద్ధలతో వాడవాడలా నవరాత్రి ఉత్సవాలు
- అట్టహాసంగా నిర్వహణ
- విద్యుత్ దీపాలతో మండపాల అలంకరణ



పాడేరు పాత బస్టాండ్‌లో కొలువుదీరిన 15 అడుగుల మట్టి గణపతి విగ్రహం

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చవితి పండగ నాడు భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. పోటా పోటీగా విగ్రహాలను ఏర్పాటుచేశారు. పండగను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీ శివశ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు, రంపచోడవరం, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల హాస్టళ్లు,గురుకులం,కేజీబీవీ,ఏకలవ్య విద్యాలయాల్లో గణపతికి పూజలు నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్‌లో ప్రతిష్ఠించిన15 అడుగుల మట్టి గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బందోబస్తు మధ్య నిమజ్జనం

పూజామందిరాల్లో ఏర్పాటు చేసిన గణపతి ప్రతిమలను సోమవారం సాయంత్రం గెడ్డల్లో నిమజ్జనం చేశారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గెడ్డల వద్ద పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనం ఊరేగింపుల్లో యువతీయువకులు థింసా నృత్యాలతో సందడి చేశారు. ఇక్కడికి సమీపంలోని చిలకలమామిడి గెడ్డ,తుంపాడ చెరువు, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట,పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని మత్స్యగెడ్డ, హుకుంపేటలోని రాళ్లగెడ్డ,అడ్డుమండ,దిగుడుపుట్టు, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి, కురిడి గెడ్డ, అరకులోయలోని కొత్తవలస, చొంపి, అనంతగిరి మండలంలోని గోస్తనీ, శారద నదీ పరివాహక ప్రాంతాల్లో భక్తులు గణనాథుల విగ్రహాలను నిమజ్జనం చేశారు.



పాడేరులోని సాయిబాబా గుడి ప్రాంతంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం





గెడ్డలు, వాగుల నీటిలో గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



చిలకలమామిడి గెడ్డలో నిమజ్జనానికి తీసుకెళుతున్న మహిళలు

4 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

హుకుంపేట: మండలంలోని తీగవలస పంచాయతీ రాతులపుట్టు గ్రామ సమీపంలో సారా తయారీకి నిల్వ చేసిన నాలుగు వేల లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ సంతోష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సారా తయారీకి ఉపయోగించే సామగ్రితో పాటు పులుపు ధ్వంసం చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ టి.సురేష్‌కుమార్, సిబ్బంది నాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డులో వ్యాన్ బోల్తా



జి.మాడుగుల: చింతపల్లి–జి.మాడుగుల ఆర్ అండ్‌బీ రోడ్డులో కొక్కిరాపల్లి ఘాట్ రోడ్డు వద్ద మంగళవారం వారపుసంత నుంచి నర్సీపట్నం వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. జి.మాడుగుల సంతబయలు గ్రామంలో వారపుసంతకు వచ్చి మంగళవారం సాయంత్రం మైదాన ప్రాంతం నర్సీపట్నానికి చిరువ్యాపారులను తీసుకెళ్తుండగా, వ్యాన్ బ్రేక్ ఫెయిలై అదుపు తప్పి బోల్తా పడింది. వారిలో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీస్‌లకు ఫిర్యాదు అందాల్సింది.

రాష్ట్ర హోంమంత్రిని కలిసిన ఎంఆర్‌పీఎస్ నాయకులు



రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితకు మొక్కను అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

గంగవరం : ఏజెన్సీ ప్రాంతంలో ఏన్నో ఏళ్లుగా నివసిస్తున్న మాదిగల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను కోరినట్టు ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నిడమర్తి చినబాబు తెలిపారు. ఇన్ఫోర్మ్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షులు వేమగిరి ముసిలిబాబు, ఇన్ఫోర్మ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు గెద్దం బాపిరాజు తదితరుల ఆధ్వర్యంలో హోంమంత్రి తానేటి వనితను కలిసి సమస్యలు వివరించినట్టు చెప్పారు. ఇన్ఫోర్మ్ ఇంటర్నేషనల్ సమాచార కార్యదర్శి పింగళి విజయ్, విజయవాడ కార్యదర్శి నవీన్, ఏజెన్సీ ప్రాంత ఎంఆర్‌పీఎస్ నాయకులు పి. దొరబాబు, ఎస్.సురేష్ ,నిడమర్తి. బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మీ గుండెకు భరోసా



విజయవంతంగా ప్రాజెక్టు
- గుండె భద్రతకు సర్కారు సాయం
- విశాఖలో ప్రయోగాత్మకంగా అమలు

మహారాణిపేట: గుండె సంబంధిత వ్యాధుల కారణంగా పెరుగుతున్న మరణాల రేటును తగ్గించేందుకు ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన వారికి అత్యంత కీలకమైన మొదటిగంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్ (స్టెమి) ప్రాజెక్టుకు వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. గుండెపోటు వచ్చిన తొలి గంటలోపే అంటే గోల్డెన్ అవర్‌లోపే అత్యవసర ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలు నిలబెట్టేందుకు అవకాశం ఉంది. ఈ పైలట్ ప్రాజెక్టు విశాఖలో విజయవంతంగా అమలు చేస్తున్నారు.

గుండెనొప్పి వచ్చిన వారికి తక్షణం థ్రాంబోలిసిస్‌కు సంబంధించిన ఇంజెక్షన్లు ఇవ్వాలి. దీని ఖరీదు సుమారు రూ.40వేలు వరకు ఉంటుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన వివిధ ఆస్పత్రుల్లో ఈ ఇంజెక్షన్ ఉచితంగా ఇచ్చి రోగి ప్రాణాలు కాపాడుతున్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి విశాఖలో 14 కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల (సీహెచ్‌సీ)ల్లో ఈ ప్రాజెక్టు అమలవుతోంది. రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉన్న మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉండే బోధనాస్పత్రుల్లో ఈ ప్రాజెక్టు అమలు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా ఉండే వైద్య విధాన పరిషత్ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ)లో కూడా అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్‌గా ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్‌ను ప్రభుత్వం నియమించింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏయే ఆస్పత్రుల్లో...

ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 14 ఆస్పత్రులను ఎంపిక చేశారు. విశాఖ జిల్లాలో ఏరియా ఆస్పత్రి (అగనంపూడి), భీమిలి, గోపాలపట్నం, పెందుర్తి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, అనకాపల్లి జిల్లా ఆస్పత్రితో పాటు కె.కోటపాడు, యలమంచిలి, నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి, చోడవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అల్లూరి జిల్లాలోని అరకు ఏరియా ఆస్పత్రి, పాడేరు జిల్లా ఆస్పత్రి, వి.మాడుగుల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఈ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

ఒక్కో ఆస్పత్రికి ప్రత్యేకంగా అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి ఆస్పత్రిలో ఐసీయూ, ఆక్సిజన్, వెంటిలేటర్ ఇతర పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో థ్రాంబోలిసిస్‌కు సంబంధించిన ఇంజెక్షన్లు రెండేసి అందుబాటులో ఉన్నాయి.

లబ్ధి ఇలా..

- గొలుగొండ మండలం కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన యు.గిరిధర్ (55) ఈనెల 7వ తేదీన ఆకస్మాతుగా గుండెనొప్పి వచ్చింది. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు.
- రోలుగుంట మండలం బుచ్చింపేట గ్రామానికి చెందిన అనిమిరెడ్డి నాగరాజు (70)కు ఈనెల 15వ తేదీన గుండెనొప్పి రావడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడారు.
- కూర్మన్నపాలెం ప్రాంతం శాతవాహననగర్‌కు చెందిన గున్నం రత్నం (78)కి ఈనెల 2వ తేదీన గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకొని వచ్చి ఇంజెక్షన్ ఇచ్చారు. దీంతో రత్నం ప్రాణాలను వైద్యులు కాపాడారు.

అత్యవసర సేవలు

గుండె నొప్పి వచ్చిన వెంటనే తొలుత ఈసీజీ తీయాల్సి ఉంటుంది. ఈ రిపోర్టును కార్డియాలజీ విభాగంలో విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మికి వాట్సప్‌ద్వారా పంపుతున్నారు. వారి సలహా, కార్డియాలజీ వైద్యుల సూచన మేరకు రోగికి సుమారు రూ.40 వేలు విలువ చేసే టెనెక్టెప్లాస్ ఇంజక్షన్ ఉచితంగా ఇస్తున్నారు. ఇప్పటి వరకు నర్సీపట్నంలో రెండు, అగనంపూడిలో ఒక ఇంజెక్షన్ ఇచ్చారు. దీని వల్ల తక్కువ వ్యవధిలో ముగ్గురు ప్రాణాలను వైద్యులు కాపాడారు.

విజయవంతంగా..



స్టెమి ప్రాజెక్టు ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయవంతంగా అమలు జరుగుతోంది. ఆకస్మాత్తుగా గుండె జబ్బులు వస్తే సంబంధిత ఏరియాలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో వైద్యులను సంప్రదించాలి. వైద్యం అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. గుండె జబ్బులున్న వారికి స్టెమి ఓ బాసటగా నిలుస్తోంది.

–డాక్టర్ రమేష్ కిశోర్, ప్రాజెక్టు నోడల్ అధికారి

ప్రాణాలు కాపాడారు



నా వయస్సు 78ఏళ్లు. ఈనెల 2వ తేదీన గుండె నొప్పి వచ్చింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశా. అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. అక్కడ పరీక్షలు చేశారు. ఆ తర్వాత టెనెక్టెప్లాస్ ఇంజక్షన్ ఇచ్చారు. కొద్ది రోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు. ఇప్పుడు ఆరోగ్యం కుదుటపడింది.

–గున్నం రత్నం, శాతవాహన నగర్, కూర్మన్నపాలెం

గిరిజనుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

ఉమ్మడి విశాఖ జెడ్పీచైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని మాకవరం పంచాయతీ మేబ గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. జెడ్పీ నిధులు రూ.1.30 లక్షలతో గ్రామంలో ఏర్పాటు చేస్తున్న బోరు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తూ ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గిరిజనులు సంక్షేమ బాటలో పయనిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై దృష్టిసారించామని, జెడ్పీ నిధులు రూ.50లక్షలతో ముంచంగిపుట్టు మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి బోర్లు,బావులు, రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు,డ్రైనేజీలు మంజూరు చేసినట్టు చెప్పారు. గిరిజనులంతా వైఎస్సార్‌సీపీ పక్షాన ఉండి అభివృద్ధి పథంలో నడవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ భాగ్యవతి,సర్పంచ్ గంగాధర్, వైఎస్సార్‌సీపీ మండల నేతలు మూర్తి,రాంప్రసాద్,దామోదరం తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పనులు వేగవంతం

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం



హాజరైన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన ఇంజినీరింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలతో కలిసి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పాడేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గడపగడపకు మన ప్రభుత్వం పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా 58 పనులు పూర్తికాగా, రూ.కోటి 35లక్షల బిల్లులు చెల్లించామని తెలిపారు. మరో 119 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ద్వారా 19 పనులు పూర్తి చేసి రూ.47లక్షల 65వేలు బిల్లులను చెల్లించామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వం ప్రతి పంచాయతీకి రూ.40 లక్షలు మంజూరు చేసిందని, వాటితో పనులు చేపడుతున్నామన్నారు. రూ.5లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిపై, అంతకు మించి పైబడిన పనులను టెండర్ పిలవాలన్నారు. పెండింగ్ పనులన్నింటిని వేగవంతంగా పూర్తిచేస్తే వెనువెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. తాగునీటి పథకాల పనులను మరింత వేగవంతంగా చేపట్టి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని 97 సచివాలయాలకు 85 చోట్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కొన్ని చోట్ల పూర్తయ్యాయన్నారు. మిగిలిన 12 సచివాలయాల్లో పనులు కూడా త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. మండల సర్వసభ్య సమావేశాలకు కొన్నిశాఖల అధికారులు హాజరుకావడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. భవనాలు లేని పాఠశాలలకు భవన నిర్మాణాలు,ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు కొండయ్యపడాల్, లీలాకృష్ణ, ఎంపీపీలు,ఎంపీటీసీలు, సర్పంచ్‌లు,డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

గాజులబంద గిరిజన యువతలో చైతన్యం



గంజాయి సాగును ధ్వంసం చేస్తున్న గాజులబంద గిరిజన యువత



గాజులబంద గిరిజన యువతకు వాలీబాల్ కిట్ అందిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

వందల ఎకరాల్లో గంజాయి పంట ధ్వంసం

ముంచంగిపుట్టు: గంజాయి వల్ల కలిగే అనర్థాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు మండలంలో విస్తృతంగా నిర్వహించడంతో గిరిజన యువతలో చైతన్యం కలిగించింది. బాబుశాల పంచాయతీ గాజులబందగ్రామంలో ఇటవలే పోలీసులు గంజాయి సాగు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. గ్రామస్తులకు గంజాయి వల్ల కలిగే నష్టాలను వివరించారు. దీంతో ఆలోచనకు వచ్చిన గ్రామ గిరిజన యువత మంగళవారం గ్రామ సమీపం కొండ ప్రాంతాల్లోని వందల ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేశారు. గ్రామంలో గంజాయి సాగు ఎవరూ చేయకూడదని తీర్మానానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రవీంద్ర వారిని ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు పిలిచి అభినందనలు తెలియజేసి, వారికి వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు.

రైతు పొలంలో చెట్ల నరికివేత

అటవీ సిబ్బందిపై పొలం యజమానుల ఫిర్యాదు



రైతు పొలంలో నరికిన చెట్టు

రంపచోడవరం: ఐ పోలవరం రోడ్డు విస్తరణ పనులకు ఎటువంటి సంబంధం లేని తన పొలంలోని పది చెట్లను ఎఫ్‌డీవో వెంకటేశ్వరరావు నరికించివేశారని పొలం యజమానులు శ్రీనివాసుదొర, వెంకటలక్ష్మి మంగళవారం సూదికొండ రేంజర్ అధికారికి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ కోసమే అలా చేశారని ఆరోపించారు. రంపచోడవరం మండలం ఐ పోలవరం నుంచి గంగవరం వరకు జరగుతున్న హైవే పనుల్లో బీరంపల్లి వద్ద తమ పొలంలో చెట్లను అటవీ సిబ్బంది నరికించడంతో పొలం యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎటువంటి మార్కింగ్ చేయకుండా ఎలా నరుకుతారని ప్రశ్నిస్తే ఎఫ్‌డీవో వెంకటేశ్వరరావు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని తెలిపారు.దీనిపై ఎంపీటీసీ తుర్రం వెంకటేశ్వరరావు ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకుండా దుర్భాషలాడినట్టు తెలిపారు.సూదికొండ రేంజర్ కరుణాకరన్‌ను వివరణ కోరగా విచారణ చేస్తామని చెప్పారు.

పాడేరు–భద్రాచలం ఆర్టీసీ సర్వీసు

- ఏర్పాటుకు రూట్ సర్వే
- తెలంగాణ, ఛత్తీగఢ్ ఒడిశాకు బస్సులు
- పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్

గూడెంకొత్తవీధి: పాడేరు నుంచి భద్రాచలానికి బస్సు నడింపేందుకు వీలుగా సర్వే చేస్తున్నామని పాడేరు ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ వెల్లడించారు. పాడేరు నుంచి వయా చింతపల్లి, సీలేరు, చింతూరు మీదుగా భద్రాచలంకు బస్సు సర్వీసు ఏర్పాటు ఆలోచనలో ఉందన్నారు. ఇందుకు సంబంధించి సర్వేలో భాగంగా మంగళవారం ఇక్కడికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గడ్ రాష్ట్రాలతో పాటు అంతర్ జిల్లాలకు ఎక్కువ బస్సు సరీ్వసులు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. సురక్షిత ప్రయాణం కోరుకునే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలని సూచించారు. రోడ్డు సౌకర్యం ఉన్న ప్రాంతాలకు బస్సులను పంపేందుకు చూస్తున్నామన్నారు. సీఐ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

సైక్లిస్టులు శివకుమార్‌రెడ్డి, రవికృష్ణ

అనంతగిరి: సైక్లింగ్‌తో ఆరోగ్యంగా ఉండవచ్చని, సైక్లిస్టులు శివకుమార్‌రెడ్డి, రవికృష్ణ తెలిపారు. విశాఖపట్నం వడ్లపూడి గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన వీరు సైక్లింగ్ చేసుకుంటూ సోమవారం అనంతగిరి వచ్చారు. తిరుగుప్రయాణంలో కొంత సేపు మాట్లాడారు. శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బిజీ జీవితంలో ఆరోగ్యంపై దృష్టిపెట్టకపోవడంతో అనేకమంది అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. యువత సైక్లింగ్‌పై దృష్టిసారించాలని తెలిపారు. గత ఆగస్టు 20 నుంచి 24వ తేదీ వరకు వరకు పారిస్‌లో జరిగిన సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. 1,220 కిలో మీటర్లను 90 గంటల్లో పూర్తిచేయాల్సి ఉండగా, 86 గంటల్లో చేరుకుని పతకం సాధించినట్టు తెలిపారు. ఈ పోటీల్లో అమెరికా, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, జపాన్, ఇండియా, కొరియా తదితర దేశాల నుంచి 6,400 మంది పాల్గొన్నారని, మన దేశం నుంచి 290 మంది పాల్గొన్నారని తెలిపారు. విశాఖపట్నం నుంచి పాల్గొన్న ఐదుగురిలో తానూ ఒకడిని అని శివకుమార్‌రెడ్డి చెప్పారు.

400 కిలోల గంజాయి పట్టివేత





వేర్వేరు గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులతో పోలీసులు

- వేర్వేరు కేసుల్లో ఆరుగురి అరెస్టు
- మరో ఇద్దరు పరారీ

మోతుగూడెం: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో వేర్వేరు కేసుల్లో మంగళవారం 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ చెక్ పోస్టు పరిసరాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. వేర్వేరు ప్రాంతాల్లో మూడు కార్లలో గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ కేసుల్లో 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. మరో ఇద్దరు పరారైనట్టు ఆయన తెలిపారు. గంజాయిని సుకుమామిడి గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందిని అప్రమత్తం చేసి తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీల్లో పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఘాట్‌రోడ్డులో ప్రమాదం

ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన బైక్, గాయపడిన సుబ్బారావు



గాయపడిన యువకుడు నరేష్

జి.మాడుగుల: మండలంలోని లువ్వాసింగి రోడ్డులో పాలకొండ ఘాట్ వద్ద రెండు బైకులు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జి.మాడుగుల మండలం తడపాలెం గ్రామానికి చెందిన వంతాల సుబ్బారావు మంగళవారం వారపుసంతకు వచ్చి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తన బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో చేపల్లి గ్రామానికి చెందిన సాగేని సింహాచలం తన పని నిమిత్తం జి.మాడుగుల వైపు బైక్‌పై వస్తూ పాలకొండ ఘాటీ రోడ్డులో ఇద్దరు బలంగా ఢీ కొన్నారు. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో స్థానిక పీహెచ్‌సీకి తరలించి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

ఎదురెదురుగా వచ్చి ఆటో, బైక్ ఢీ...



చికిత్స పొందుతున్న బాలుడు బాక ఎనోష్



గాయపడిన యువకుడు నరేష్

ఇద్దరికి తీవ్ర గాయాలు..

అనంతగిరి: స్థానిక బొడ్డచెట్టు కాలనీ సమీపంలోని మలుపు వద్ద మంగళవారం ఆటో, బైక్ ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టాయి. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న యువకుడికి, బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. దండబాడు గ్రామానికి చెందిన నరేష్(28), పెద్దూరు గ్రామానికి చెందిన బాలుడు బాక ఎనోష్(11) కలిసి బైక్‌పై కొత్తవలస నుంచి వస్తుండగా, లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎన్.సింహాద్రిబాల తన ఆటోతో ఎదురుగా వెళ్లి బొడ్డచెట్టు కాలనీ సమీపంలో మలుపు వద్ద ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలోని బైక్‌పై ప్రయాణిస్తున్న నరేష్, ఎనోష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను అనంతగిరి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.